కథానిక

# నివురుచాటు నిప్పు

"హితశ్రీ"

మా రామేశానికి ఏ లలితకళలోనూ-ప్రావీణ్యం సంగతి దేవుడెరుగు-కనీసం ప్రవేశం అయినా లేకపోవడం నాకు చాలా బాధాకరంగా ఉంది. చాలాసార్లు అతడితో ఈ విషయం ముచ్చటించాను. నవ్వేసి ఊరుకునేవాడు. చూస్తే వాడికి తన తక్కువతనాన్ని గురించి గొప్ప అభిప్రాయం ఉన్నట్టుంది. నిజానికి వాడు ఏ లలితకళలోనైనా ప్రకాశించగలగడం అసంభవం అని నాకూ గట్టినమ్మకమే ఉంది. ఆ మోటుశరీరమూ, వాడూ—ఆకారానికి, కళకీ సంబంధం ఏమిటి అని మీరడగవచ్చు. నిజమే ననుకోండి. అయినా ఇటువంటివాడిని చూసి ఏ లలితకళ ప్రేమిస్తుంది? ఏమైనా వాడిమీద నాకు ఏర్పడిన స్నేహవాత్సల్య భావాల ప్రభావం అధికమై, వాడిని ఎలాగైనా ఓ చిన్న కళాకారునిగా తయారుచేయాలనే' నా సంకల్పం రోజురోజుకూ గాఢతరం కాసాగింది.

బల్లమీద కాళ్ళని పారేసి అలంకారంగా చేతిలోఉన్న పుస్తకాన్ని చదవకుండా చూస్తూ రామేశానికీ-కళకీ పరస్పర సుహృద్భావం, సానుభూతీ ఎలా సంప్రాప్తంకాగలవో ఆలోచిస్తున్నాను. ఠపీమని దెబ్బపడ్డది వీపుమీద. అదరిపడిచూశాను. మోటుమనిషి - వీడికా కళాదేవి కటాక్షం!

'ఏమిత్రా, ఎప్పుడూ దీర్ఘాలోచనా, నువ్వూ'

'నీ గురించే. ఇంత మోటుమనిషికి కళ ఎలా అబ్బుతుందా అని.'

'పోనిద్దూ.'

'అలాకాదు. నువ్వు తప్పకుండా అభ్యాసం చేయాలి.'

ఏమిటీ తద్దినం అన్నట్టు చూశాడు.

'బొమ్మలు గీస్తావా?'

'నువ్వు గీస్తున్నావుగా చాల్లే.'

'పోనీ, కథలు వ్రాయడం నేర్చుకుంటావ్రా?'

'నీ మొహంలే' అన్నట్టుగా నవ్వాడు. హాస్యాస్పదంగా బావురు కప్పలా నోరు తెరచి భూనభోంతరాళాలు బ్రద్దలయేటట్టు సున్నితంగా నవ్వడమే ఎరగని వీడినా కళాదేవి కాంక్షించేది! వీడి నిలా వదలివేయడం శ్రేయస్కరం.

'ఏమిటోయ్, తెగ నవ్వుతున్నారు!' ఉలిక్కిపడి చూశాను. ప్రసాద్.

'కాసిని మంచినీళ్లివ్వరా, బాబూ'

చతికిలబడ్డాడు-ఆఖరిసారి దమ్ము గట్టిగా పీల్చి పారేసి, రైలు ఇంజిన్‌లా పొగ వదుల్తూ. ఇచ్చాను. ఒక్కగుక్కలో పీల్చేసి ఆ గాజు గ్లాసువైపు వింతగా చూశాడు.

'ఏం. కాసిని కావాలా?'

'ఊహుఁ - ఒరే, రావూ - ' వాడివైపు చూశాను.

'మనంచేసే ప్రతీ పనిలోనూ, మనం ఆడే ప్రతీ మాటలోను కళాకారులకీ, తదితరులకీ ఉండే వ్యత్యాసం కనిపిస్తూనే ఉంటుంది.' ధోరణి అర్థంకాక తల పంకించాను.

'కళాకారుడు చేసే ప్రతిచేష్టలో, అది ఎంత చిన్నవిషయం అయినా సరే, కళలో అతడికిగల అభిరుచీ, ప్రతిభా గోచరిస్తూనే ఉంటాయి. ఏమంటావ్?'

చెప్పే దేమీ లేక మళ్ళీ తల ఆడించాను నిలువుగా.

'ఉదాహరణకి ఈ గాజుగ్లాసు తీసికో. వొట్టి సాదా గ్లాసు. పావు పౌను బరువు తప్ప దీంట్లో ప్రత్యేకత ఏమీ లేదు. దీని సొంతదారుడుకూడా సాదా మనిషై ఉండాలి. లేకపోతే దీనిని కొని ఉండడం సంభవించదు—'ఒక గొప్ప సత్యాన్ని కనిపెట్టి బోధించేవాడులా గంభీరంగా ముఖం పెట్టాడు.

'నీ సూత్రం అందరికీ వర్తించక పోవచ్చు.'

'సర్వ సామాన్యంగా వర్తించి తీరాలి.'

క్తి ఆర్థిక పరిస్థితులూ, శ్రద్ధాసక్తులూ నీ సూత్రానికి అడ్డు సవాళ్లు కావటానికి వీల్లేదా?'

'కొంతవరకు. కాని సాధ్యమైనంతగా ప్రతి విషయంలో కళాకారుడు సామాన్యుడినుంచి తనని వేరు పరచుకుంటూనే ఉంటాడు. ఇంత ఎందుకు - నీ విషయంలో సరిగా చెప్పానంటావా, లేదా?' వస్తున్న నవ్వు ఆపుకుని రామేశం వైపు చూశాను. చిన్నగా నవ్వాడు. చిన్నగా అంటే గది నాలుగు గోడలు మాత్రమే ప్రతిధ్వనించేలా అని మీరు అర్థం చేసుకోవలసి ఉంటుంది. విజయవంతంగా ప్రసాద్ కూడా నవ్వాడు.

'స్పష్టంగా చెపుతున్నాను. ఏమీ అనుకోవు అని నాకు తెలుసులే. పౌరాణిక యుగంనాటి ఈ పాటలూ, గది మధ్యన ఈ కుంటి బల్లా, చిందర వందరగా పారేసిన పుస్తకాలూ, ఆమూల కూజా, ప్రక్కనే చీపురూ, బీడులాంటి ఆ దొడ్డీ, గాలికి ఎగురుతూ సంచారం చేస్తున్న అందమైన ముఖచిత్రంగల ఆ కవరు పేజీ— ఇవన్నీ చూస్తే ఈ ఇంట్లో నివసించే మానవుడికీ, కళకీ గల శత్రుత్వం ఏ జన్మానికీ తీరేదికాదని తోచక మానదు. నడుస్తున్నప్పుడు ముక్కుకు సూటిగానే గాని చుట్టు ప్రక్కల సుందర దృశ్యాల కోసం ఎప్పుడైనా వెతికావా?—ఇహ రామేశం గాడు—వాడు నీకు ఎంతమాత్రం తీసిపోడు—'

ఒక్కసారిగా దిక్కులు పిక్కటిల్లేలా నవ్వాడు రామేశం. వాడు నవ్వాడేగాని నాకు మాత్రం కించిత్తు కించగానే ఉంది. రామేశం ఎదట నేనిలా తక్కువ చేయబడడం ఏమీ బావుండలేదు. బయటికి కనపడకపోతే మనిషిలో విలవ ఏమీలేనట్టు ప్రసాద్ తీర్మానించడం హాస్యాస్పదంగా ఉంది.

'కానియ్యి, భాయీ. నీ థియరీ చాలా అద్భుతంగా ఉంది. నన్ను గురించి ఇంకేమైనా చెపుదూ.'

ఉత్సాహంలో రామేశం మాటల్లోని వ్యంగ్యం గ్రహించలేదు ప్రసాద్.

'చెప్పేందు కేముంది? శతఘ్ని మోతలాంటి నీ స్వరం, మేఘగర్జనంలాంటి నీ నవ్వూ కళాకన్యను యోజనాల మేరకు తరిమేశక్తి గలవి. ఇహ నీ ఆకారం కళాకన్యకి ఓ ముళ్లకంచె సదృశం- చాలా ?'

'చిత్తం.'

రామేశం విషయంలో ప్రసాద్ చెప్పిన ముక్కల్లో ఏ ఒక్క అక్షరమూ అత్యుక్తికి ఆస్కారం కలిగించలేదనడం నిస్సందేహం అనుకున్నాను. నే నిలా ఆలోచిస్తూ ఉండగా ఓ చిన్న తమాషా జరిగింది. రామేశం తన పక్కనే ఉన్న అలమారు తలుపులు తెరిచి యిలా అన్నాడు:

'భాయీ, ఘోరంగా అడుసులో కాలు వేశావు! అలమారులోని ఈ వింతని వీక్షించు.'

అదిరిపడ్డాడు ప్రసాద్. కారణం- అలమారులో నీటిరంగుల శివుడు తాండవం చేస్తున్నాడు కాగితంపైన. పక్కన 'రావు' అనే ఎర్రటి రెండక్షరాలు చూసి వాడి కళ్ళు గిరగిర తిరిగి ఉండాలి-

'హరి పిడుగా, ఇన్నాళ్ళ నుంచీ చెప్పావు కాదేం' అన్నాడు హీనస్వరంతో ప్రసాద్. నా మనసు లోలోపల గర్వించగా చేయి మీసం ఉండవలసిన ప్రదేశాన్ని తడిమింది—

'వస్తానర్రా, అలా బందరురోడ్డువైపు వెళ్ళవలసినపని ఉంది' అంటూ రామేశం కదిలేరథంలా నిష్క్రమించాడు.

ప్రసాద్, నేనూ పార్కుకి చేరుకున్నాం. అలాఅలా తిరిగి. హాయిగా వినిపిస్తున్నాయి గాల్లో భావగీతాలు. తిరిగిన బడలిక అంతా తీరేలాగ వింటూన్నాము. ఇంతలో రేడియో ఘోషించింది...

'—ఉభయకుశలోపరి-గతవారం ఈ కేంద్రం నుండి ప్రసారం చేయబడ్డ 'ప్రవీణులు' అనే నాటిక అత్యుత్తమంగా ఉందని పలువురు శ్రోతలు తమ అభిప్రాయం ప్రకటించారు. రచయిత నామం తెలుపవలసినదని పెక్కుమంది శ్రోతలు వ్రాసిన లేఖలు చేరినాయి. ఆ నాటిక రచయిత శ్రీ దాగిన రామేశంగారు.'

జాగ్రదావస్థలోనే ఉన్నానని శరీరాన్ని గిల్లి తెలుసుకొన్నాను. ప్రసాద్ వైపు చూశాను. సిమెంటు బెంచీకి జేరగిలబడి, అబద్ధాలుచెప్పే విద్యార్థివైపు మేష్టారిలాగా, లౌడ్‌స్పీకర్ వైపు చూస్తున్నాడు వాడు తీక్ష్ణంగా.